# ఆశ

- మొగిలి దేవప్రసాద్

పశ్చిమ దిక్కులో భారంగా వీడ్కోలు చెబుతున్నాడు సూర్యుడు. జేగురు రంగు కిరణాలు ఆకాశమంతా విస్తరించి వింత శోభను కల్గిస్తున్నాయి. నేను డ్రైవ్ చేస్తున్న కారు సర్రున దూసుకువెళుతోంది. ఎదురుగా నల్లగా వంపులు తిరిగిన తారు రోడ్డు. ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు. నగరంలోనికి ఎంటర్ కాబోతున్నాను. విజయవాడలో ఓ అరుదయిన ఆపరేషన్‌ను విజయవంతంగా చేసి తిరిగి వస్తున్నాను. సాయంకాలపు మలయ మారుత వీచికలకు తోడుగా స్టీరియోలోంచి వస్తున్న ఘంటసాల గాన వాహినికి పరవశత్వం ఆవహిస్తోంది.

అంతలో అకస్మాత్తుగా రోడ్డుప్రక్కగా వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు మధ్యకు వచ్చి పడిపోయాడు.

వెంటనే బ్రేకు వేశాను... కంగారుగా! కీచుమని శబ్దం చేస్తూ దాదాపు తాకినంత దగ్గరగా వెళ్లి ఆగింది కారు. క్రిందకు దిగి చూశాను. పెద్ద ప్రమాదం లేదు... కాని కాలికి చిన్న గాయం... రక్తం కారుతోంది.

ఆ వ్యక్తిని పరిశీలనగా చూశాను. దాదాపు ఎనభై సంవత్సరాల వయస్సు వుండవచ్చు. ఖరీదయిన చొక్కా, పంచకట్టులో వున్నాడు. ప్రక్కనే మంచి ఖరీదయిన వాకింగ్ స్టిక్ పడివుంది... లేపి కూర్చోబెట్టాను.

"ఎందుకు నాయనా ఆపావు... నా మీదుగా పోనిచ్చి పుణ్యం కట్టుకోరాదా?" అడిగాడు మెల్లగా ఆ వ్యక్తి.

'మైగాడ్... సూసైడా...? అదీ... యీ వయస్సులోనా?' అనుకుంటూ...

"ముందు మీరు రండి" అంటూ అతడిని కార్లో కూర్చోబెట్టాను... దారిలో మరేం మాట్లాడకుండా... నేరుగా యింటికి తీసుకెళ్లాను. ఎందుకంటే ఫ్రెండ్ కార్లో రావడం మూలంగా కార్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ లేదు మరి.

ఇంట్లో పని పిల్లవాడు రాజు తప్ప ఎవరూ లేరు. అంతా బంధువుల యింట్లో పెళ్లికి వెళ్లారు. ఆ వ్యక్తిని రాజు సాయంతో యింట్లోకి తీసుకెళ్లి, గాయాన్ని కడిగి బాండేజ్ కట్టి, యాంటి సెప్టిక్ యింజక్షన్ యిచ్చాను. అతడిని బెడ్‌పై పడుకోబెట్టి నేను ఫేస్ వాష్ చేసుకొని వచ్చేలోగా రాజు మా యిద్దరికి వేడివేడిగా కాఫీ తీసుకువచ్చాడు.

"ఆఁ...యిప్పుడు చెప్పండి... మీ పేరు?" అడిగాను కాఫీ యిస్తూ...

"నేనా...నా పేరు ధర్మారావు" చెప్పాడతడు.

"ధర్మారావా...!? మీ వూరు రాజవరం కాదు కదా?" అప్రయత్నంగా అడిగాను.

"అవును... ఆ వూరే... ఏం నాయనా?" బదులిచ్చాడు ఆ వ్యక్తి.

వెంటనే లేచి నమస్కరించి "అయ్యో క్షమించండి అయ్యగారూ! మిమ్మల్ని చూసినప్పటినుండి కాస్త అనుమానం వేసింది... కాని గుర్తించలేకపోయాను... నేనండీ నారాయణను" అన్నాను.

"నారాయణా...?" అనుమాన ఆశ్చర్యాలు మిళితం చేస్తూ అడిగాడు ధర్మారావు.

"అవును... మీ యింట్లో పాలేరుగా పనిచేసిన సుంకన్న కొడుకును. మీరు చేసిన సహాయంతో చదివి డాక్టరునయ్యాను" పాదాలకు నమస్కరించాను.


"ఆఁ... మా సుంకిగాడి కొడుకు నారాయణరావా? ఆఁ...ఆఁ... గుర్తుకు వచ్చింది. మన ఊళ్లో స్కూలు ఫస్ట్ వచ్చావని మెడల్ కూడా యిచ్చారు కదూ! ఎంతకాలం అయింది నిన్ను చూసి..." అన్నాడు ధర్మారావు.

"నిజమే అయ్యా! అమ్మా నాన్న యాక్సిడెంట్‌లో పోవడంతో యిక ఆ వూరికి రాలేదు... యిక్కడే సిటీలోనే ప్రాక్టీస్ చేస్తున్నాను. అది సరేనయ్యా మీరేంటి యిలా? ముందు యింటి ఫోన్ నంబరు చెప్పండి... విషయం తెలియజేస్తా"నన్నాను.

"వద్దు నారాయణా! ఎవరికీ చెప్పవద్దు దయచేసి."

ఎందుకని అడిగే ప్రయత్నం చేయలేదు... నిదానంగా తెలుస్తుంది కదా! ముందు ప్రశాంతంగా వుండనిద్దాం.

"సరే...ముందు కాసేపు పడుకోండి"అని చెప్పి రాజుకు మీల్స్ అరేంజ్ చేయమని చెప్ప



డానికి వెళ్లాను.

❊ ❊ ❊

డైనింగ్ హాల్లో అన్నీ సిద్ధం చేశాడు రాజు. నేను ధర్మారావుగారిని తీసుకొని వచ్చి కూర్చోబెట్టాను. రాజు వడ్డిస్తున్నాడు. టేబిల్‌పై చికెన్ ఫ్రై, బాయిల్డ్ ఎగ్స్, చపాతీలు, రైస్, రసము, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, నిమ్మకాయ ముక్కలు- వీటిని అన్నింటినీ చూసేసరికి అమాంతం ప్లేటులోనికి వేసుకోవాలని చేతులు ముందుకు చాచాడు ధర్మారావు. కాని ఆగి...నా వైపునకు చూశాడు.

అతడి కన్నుల్లోని భావాలు చదివాను.

"అయ్యా! యిది మీ యిల్లు...ఎలాంటి మొహమాటం అవసరం లేదు" అన్నాను.

"చాలా సంతోషం"అంటూ ప్లేటులోనికి కూర వేసుకొని, నిమ్మకాయ పిండుకొని చపాతీలు తీసుకొన్నారు. మధ్యమధ్యలో ఉల్లిపాయ ముక్కలు అంటూ గబగబా...ఆత్రంగా భోం చేస్తున్నాడు. ఆ కన్నుల్లో... ముఖంలో... ఏదో తెలియని సంతృప్తి... ఆనందం కలగలిసిన భావం... నేనేమీ మాట్లాడకుండా మౌనంగా తింటున్నాను.

భోజనం పూర్తయ్యాక రాజు పక్కలు వేశాడు. ముందుగానే తెప్పించిన పాన్ అందించాను. నమ్మలేనట్లు చూశాడు ధర్మారావు.

"భలే వారయ్యా! నాకు తెలియదా? మీరు రోజూ తాంబూలం వేసుకునేవారు" అన్నాను.

పాన్ నములుతూ కనులు మూసుకొని మంచంపై కూర్చున్నాడు ధర్మారావు. నేను ఏం జరిగి వుంటుందా? ఎలా అడగాలి? అని ఆలోచిస్తూ ప్రక్కనే కూర్చున్నాను కుర్చీలో... చిన్నతనంనుండి బాగా గుర్తు... ఊర్లో ధర్మారావు అంటే అందరికీ గౌరవం...

"నాయనా...! ఓ చిన్నమాట అడగనా?" ధర్మారావే అడిగాడు.

"అడగండయ్యా."

"మరేం లేదు... నీవు డాక్టరువి కదా! ఎపుడో చదివాను... అదేదో దేశంలో రోగులు కోరుకుంటే డాక్టర్లు విషం యిచ్చి వారిని చంపేస్తారట కదా!" అన్నాడు మెల్లగా!

"అదా... మెర్సీ కిల్లింగ్ అని అంటారయ్యా!"

"ఆ పని చేసి నాకు చావుకు యిస్తావా? నాకు బ్రతకాలని లేదు"... తృళ్లిపడ్డాను. నాకు నోటమాట రాలేదు... ఏంటిది? ఎలాంటివాడు! ఎలాంటి మాటలు మాట్లాడుతున్నాడు?

"ఏం నాయనా... మాట్లాడవు?"

అదేంటయ్యా! అలాగంటారు? అసలు ఏం జరిగింది? చెప్పండి. రాజాలా బ్రతికిన మీరు చనిపోవాలి అనుకునే స్థాయికి ఎలా వచ్చారు..." అన్నాను. భారంగా నిట్టూర్చి మొదలుపెట్టాడు ధర్మారావు.

"నీకు తెలియందేముందిరా! వందెకరాల మాగాణి... లంకంత యిల్లు. చేతినిండా పనివాళ్లు... ఊర్లో పెద్దమనిషిగా గుర్తింపు... మీ అమ్మగారు మా లక్ష్మి నిజంగా మహాలక్ష్మి... ముగ్గురు అమ్మాయిల తర్వాత ముచ్చటగా పుట్టాడు కొడుకు సుధాకర్!

ప్రతిరోజు యిల్లంతా సందడి సందడిగా వుండేది. తొలి కోడి కూతతో మీ అమ్మగారు లేవడం... వంటలు చేయించడం... జీతగాళ్లకు సద్దులు కట్టించడం... పెరుగు చిలికి వెన్న తీయడం... అందరికీ మజ్జిగ పోయడం... ఎంత సందడి...

తెల్లగా మల్లెపూల లాంటి దుస్తుల్లో నన్నొక మహారాజులా చూసుకుంది కదా మీ అమ్మగారు.

మొదటినుండి నాకు సిగరెట్లు, మందులాంటి అలవాట్లు లేవు గాని... అదేం రోగమో మరి రోజుకు ఓ పది మార్లయినా...కాఫీ త్రాగకుండా వుండలేకపోయేవాణ్ణి. అమ్మగారు యిచ్చే చిక్కటి కాఫీ రుచి యింకా గుర్తుంది. చాలామంది సలహాలు యిచ్చేవారు ఎక్కువగా త్రాగవద్దు అని...అయినా మనం లెక్క చేస్తేనా... నిత్యం పొలం పనులతో ఉక్కుగా మారిన శరీరం... ఏమీకాదు... తిండి విషయం అంతే... నోటికి ఏది తినాలనిపిస్తే దానిని

తినెయ్యడమే... అది శాకాహారమయినా... మాంసాహార మయినా...! అలా అని ఏనాడూ అనారోగ్యం బారిన పడింది లేదు. బి.పి, షుగర్ లాంటివి మన దగ్గరికి వచ్చింది లేదు. గట్టిగా వున్నాను. చూస్తున్నావుగా...నాకు యిప్పుడు ఎనభై నాలుగేళ్లు అంటే ఎవరయినా నమ్ము తారా!

ఈ సుఖం అంతా గతం! అమ్మాయిలకు పెళ్లిళ్లు అయ్యాయి. దూర దూర నగరాల్లో వాళ్లున్నారు. సుధాకర్ అదేదో కంప్యూటర్ కంపెనీలో జాబ్ వచ్చి సిటీలో వుండిపోయాడు. తనతోబాటు పనిచేస్తున్న ఓ అమ్మాయిని యిష్టపడి పెళ్లిచేసుకున్నాడు. దాంతో నేను, మీ అమ్మగారు ఊర్లో ఒంటరిగా వుండిపోయాం. అయినా ఒంట్లో శక్తి తగ్గలేదుగా... బాగానే గడిచింది.

కాని దైవం కక్ష కట్టింది... ఏ జన్మలో ఏ పాపం చేశానో గాని విధి పాము కాటు రూపంలో మీ అమ్మగారిని నానుండి దూరంచేస్తూ యీలోకంనుండి తీసుకువెళ్లింది. ఒంటరిని అయిపోయాను...

కొడుకూ, కోడలు బలవంతం చేసి అన్నీ అమ్మివేయించి నన్ను సిటీకి తీసుకెళ్లారు. వారివద్దనే వుంచుకున్నారు. సరే... ఎవరికయినా కావలసింది అదేగా! జీవిత చరమాంకంలో పిల్లలు దగ్గరగా వుండి చూసుకోవడం కంటే యింకా ఏం కావాలి?

కాని నా పరిస్థితి తారుమారయ్యింది. కొడుకు, కోడలు యిద్దరూ ఉద్యోగులే కదా! ఉదయం లేవడం గబగబా ఆఫీసుకు వెళ్లడం... తిరిగి రాత్రికి ఏ తొమ్మిదింటికో... పదికో... రావడం... పిల్లలు వున్నారు. కాని వారిని చదువుల పేరుతో హాస్టల్లో చేర్చారు. ఇక్కడా ఒంటరితనం. వాళ్లకు నామీద ప్రేమ లేదని అనను. కాని వారిదో రకం మనస్తత్వం. కోడలు కంటే తెలియదు సరే... సుధాకర్‌కి నా గురించి తెలియదా? వాడేం మాట్లాడడు. మౌనం...యిల్లంతా నిశ్శబ్దం... ఎంతసేపని టీ.వి చూస్తూ వుండాలి? బయటకు వెళదామంటే ఎవరితో పరిచయాలు లేవు. అయినా పల్లెల్లోలాగా నాతో బాతాఖానీ వేసుకొనేవారు ఎవరుంటారు యీ పట్నాల్లో?

ఉదయం మాత్రం "నాన్నా! వెళ్లొస్తా"అని అబ్బాయి అంటే, కోడలు "మామయ్యా! అన్నీ ఫ్రిజ్‌లో వున్నాయి, పని పిల్ల పెడుతుందిలే"అని వెళతారు. ముందే చెప్పానుగా నాకు జిహ్వాచాపల్యం ఎక్కువ అని... అదే యిపుడు నాకు భారమైపోయింది.

ఉదయం ఆరు గంటలకు ఒక్కసారి చక్కెర తక్కువగా వుండే చిన్న కప్పు కాఫీ త్రాగడం... మరలా సాయంత్రం అయిదు గంటలకు చిన్న కప్పు టీ...అంతే... కాఫీ... కాఫీ... అంటూ మనసు ప్రాకులాడేది. ఏం చేస్తాం? అలా యివ్వమని వారు చెప్పారట. పని పిల్ల అలాగే యిస్తుంది. ఏం అంటే యీ వయస్సులో కాఫీ, టీలు అతిగా త్రాగితే ఆనక ఏ రోగాలో వస్తే ఎలా? చూసుకోవడం ఎంత కష్టం అంటారు.

తిండి విషయం అంతే...! ఉదయం రెండే రెండు చపాతీలు నూనె లేకుండా! దానిలోకి ఏదో కూర. రోజూ యింతే! లేదంటే అప్పుడప్పుడూ వీటికి బదులుగా రెండు బ్రెడ్ ముక్కలు. మధ్యాహ్నం రెండు గంటలకు ఫ్రిజ్‌లోంచి తీసిన చప్పిడి మెతుకులు. వీటిని తినీ తినీ నోరు చెడిపోయింది. ఏం చెయ్యను. బయటకు వెళ్లడానికి వీలులేదాయె! చేతిలో పైసా లేదు. ఆర్థిక స్వాతంత్ర్యం విలువ తెలిసి వచ్చింది. మంచి బట్టలు...ఏ.సి. రూములు అన్నీ వున్నా... ఏదో వెలితి.

ఇలా కాదని ఓరోజు అబ్బాయిని అడిగాను.

"ఒరేయ్! నాకేం తోచడంలేదు. అలా బయటకు వెళ్లి వస్తాను" అని.

"దానికేం...అలాగే వెళ్లు... కాని జాగ్రత్త" అన్నాడు వాడు.

"మరి డబ్బులు ఏమయినా" మనసులో సిగ్గుగా వున్నా అడగక తప్పలేదు. ఇవ్వబోయాడు.

కోడలు పిల్ల అడ్డుతగిలి "భలేవారు! మామయ్యగార్కి యిక్కడ ఏం తక్కువ అయ్యింది? బయట కొనుక్కు తినమని యిస్తున్నారు. చెడు అలవాట్లు కూడా లేవాయె! ఇక బయట అవీయివీ తిని ఏమయినా అయ్యిందంటే అంతా మనల్ని అంటారు" అంది.

"నిజమే సుమా! యింతగా ఆలోచించలేదు" అంటూ యివ్వకపోగా భార్యను తెగ మెచ్చుకున్నాడు నా ఆరోగ్యం పట్ల అంత శ్రద్ధ వున్నందుకు.

పండుగలు...పబ్బాలు... అన్నీ కృత్రిమం అయ్యాయి. ఏదో నామమాత్రంగా స్వీటు తీసుకురావడం... ఒక్క స్వీటుముక్క నోట్లో వేసుకొని అయ్యింది అన్పించడం. అంతా! దసరా సరదాలు గాని, ఉగాది ఉల్లాసాలు గాని, వినాయక ఉత్సవాల ఆనందం గాని ఆ యింట్లో లేదు.

ఒంటరిగా యింట్లో వుండలేక బజార్లో అటూ యిటూ తిరగడం అలవాటు చేసుకున్నాను. కాని బజారు నిండా హోటళ్లు, స్వీటు షాపులు, పాన్ షాపులు రమ్మని పిలుస్తున్నట్లుగా వుండేవి. వేడి వేడిగావేయిస్తున్న మిరప బజ్జీలు చూస్తే మనసు లాగేది. వాటివైపు ఆశగా చూసే మనసును బలవంతంగా చంపుకునే వాడిని. ఇవన్నీ వింటుంటే నేను నీకు తిండిపోతులా అన్పించవచ్చు. కాని... ఎంతో బాగా తిని బ్రతికిన శరీరం యిది. ఒక్కసారిగా అన్నీ వదులుకోవడం సాధ్యమయ్యే పనికాదు గదా? పాన్‌షాపువద్ద పాన్ కట్టడం చూస్తే రోజూ మధ్యాహ్నం భోజనం అయ్యాక మీ అమ్మగారు యిచ్చే తాంబూలం గుర్తుకు వచ్చి కనులు చమర్చేవి. కాని చేతిలో చిల్లి గవ్వాలేదు. నామీద నాకే జాలివేసేది.

ఒకరోజు యిక వుండలేక ఓ సూటు బూటు వేసుకొన్న వ్యక్తి దగ్గరగా వెళ్లి నమస్కరించాను. అతడు "ఏం కావాలి" అన్నట్లు కళ్లెగరేశాడు.

"బాబూ! నా డబ్బులు ఎవరో కొట్టేశారు. ఊరికి వెళ్లడానికి ఏమీ లేవు. తమరు దయ వుంచి ఏమయినా..." అబద్ధాన్ని ఒక్కో మాట గొంతు పెగల్చుకొని అడిగి చేయి సాచాను. ఆయన నా వంక ఎగాదిగా చూసి ముఖం చిట్లించాడు.

"ఖరీదయిన బట్టలు... చెప్పులు. స్టిక్... ఏం పనీపాట లేకుంటే సరి! అయినా ఏం తక్కువయ్యింది? ఛీ...! సిగ్గు లేకుంటే సరి" అన్నాడు. గుండె పగిలినంత పనయ్యింది. మనసు విలవిలలాడింది. అయినా ప్రయత్నం మానక మరో యిద్దరిని అడిగాను. అవే ఛీత్కారాలు...

కాని యిలా నేను అడుక్కోవడం చూసి ఎవరో అబ్బాయితో, కోడలితో చెప్పారట. వారు నన్నేమీ అనలేదు. అంటే అది మంచితనం అనుకున్నావా? యింకో భయంకరమైన పనిచేశారు.

నాకు...నాకు... వయసు పెరిగి దానితోబాటు మతిస్థిమితం కోల్పోయినానంటూ ప్రచారం మొదలెట్టారు. బయటకు వెళ్లలేను... యింట్లో వుండలేను. పనివాళ్లు, యింటికి వచ్చేవారు నన్ను అదో రకంగా చూసేవారు. ఆ చూపులలోని భావాలకు మనసు తట్టుకోలేక పోయేది. నిజంగా నాకు పిచ్చిపట్టిందా అన్పించేది. ఏంచేస్తాను? నా మాటకు విలువ వుందా? నేను వారి జీవితాలకు అడ్డుగా వున్నానా?

చిన్న పిల్లల్ని పెంచడానికి ఎంతో ఓర్పు, సహనం వుండాలి అంటారు. అంతే జాగ్రత్త పెద్దవారి విషయంలో వుండాలని వీరు చదువుకోలేదా? నాకు వయస్సు ఎక్కువ అయి యిక చావుకోసం సిద్ధంగా వుండవచ్చుగాక! కాని నాకు... కోరికలు వుండవా? అవి తీర్చుకోలేక పోతే? మరింతగా అవి విజృంభించి, మనిషిని కృంగదీస్తాయి కదా!

చివరగా... అబ్బాయికి, అమ్మాయికి అమెరికా వెళ్లే ఛాన్స్ వచ్చిందని ఆనందంగా వెళ్లిపోయారు. నన్ను మాత్రం యింట్లో పనివాళ్లకు అప్పగించారు. 'వృద్ధాశ్రమంలోనయినా చేర్పించండి'అని ప్రాధేయపడ్డాను. "అలాచేస్తే మాకెంత చెడ్డపేరు" అంటూ వారు వెళ్లిపోయి... నన్ను మరింత ఒంటరిగా చేస్తే ఆ ఒంటరితనం భరించలేక నేను జీవచ్ఛవం అయ్యాను.

అందుకే జీవితంపై విరక్తి కలిగింది. యింట్లోంచి బయటపడి ఓ లారీ ఎక్కేను... అదీ కాస్త దార్లో పంక్చరయి నడిరోడ్డుపై వదిలింది. ఇక చద్దాం అని కారు క్రింద పడబోయాను... తర్వాత నీకు తెలిసిందే...

చెప్పునాయనా! నేను చేసింది తప్పా! అయినవారికి కాని వాడినై జీవించగల శక్తి నాకు లేదు. ఆ యిల్లు ఒక బంగారు పంజరం. పంజరం బంగారుదయినా దాని గుణం మారుతుందా? పంజరంలో బ్రతుకు ఎలా వుంటుంది?

అందుకే నన్ను చంపెయ్! ఈ అభిమాన రహిత, స్వేచ్ఛారహిత జీవితాన్ని నేను భరించలేను... నాకు విముక్తి కల్గించు... నన్ను చంపెయ్. భోరుమని ఏడుస్తూ చెప్పడం ఆపాడు ధర్మారావు.

నిజమే... మనం ముందుకు వెళుతున్నాం... టెక్నాలజీతో విజయాలు సాధిస్తున్నాం... కాని మనసెరిగి ప్రవర్తిస్తున్నామా? పిల్లల్ని వారి అభీష్టంబట్టి గాక మన మనసు నిబట్టి పెంచుతున్నాం. మన నుంచి వారిని దూరం చేసుకుంటున్నాం. మన ఆలోచనల ప్రకారం మారాలని వారిని యంత్రాల్లా మార్చి హాస్టల్లో వేసి పుస్తకాలతో కుస్తీ పట్టించి వారి అందమయిన బాల్యాన్ని కాల్చేస్తున్నాం... కనీసం జీవిత చరమాంకంలో వున్న వారినయినా జాగ్రత్తగా చూసుకుంటున్నామా? వృద్ధాశ్రమాలు వున్నాయి కదా అని అంటారేమో? అన్నీ ఆర్థిక సంబంధాలే, అయితే యిక మనిషికి రాయికి తేడా ఏముంది? హృదయంలో తడి ఆరకుండా చూడాలి. అదే యీ సృష్టికీ, మానవత్వానికి జీవం.

"అయ్యా! నేను మీకు చెప్పేవాడిని కాదు. కాని, నాకు జీవితాన్ని యిచ్చినవారు. మిమ్మల్ని కంటికి రెప్పలా నేను చూసుకుంటాను. మీ ఋణం యిలాగయినా కాస్త తీర్చుకోనివ్వండి. హాయిగా మీ యిష్టం వచ్చినట్లు యీ యింట్లో వుండండి... అదీ... యీ యింటి పెద్దగా... కాదనకండి" అంటూ చేతులు పట్టుకున్నాను.

నా మాటలు ఎంత ఆనందం కల్గించాయో! "ఈ జన్మకు యిది చాలు నాయినా" అంటూ కనులు మూసుకున్నాడు. రెండు కన్నీటి చుక్కలు నా చేతులపై రాలాయి వెచ్చగా!

★

రచయిత చిరునామా:
మొగిలి దేవప్రసాద్,
ఇం.నెం.1-2-3/5,
సీతారాంపురం హిల్స్,
ఒంగోలు- 523001.